సాక్షి
విశాఖపట్నం

శనివారం । 25 । జనవరి । 2025



పద్మనాభం వంతెనపై ఉదయం 9 గంటలకు లైట్లు వేసుకుని వస్తున్న ఆటో

స్నోయగం

నగరంలో దట్టంగా కురుస్తున్న పొగ మంచు



విశాఖ నగరం మంచుదుప్పటి కప్పుకుంది. మంచు తెరలపై సూర్యకిరణాలు తొంగి చూస్తున్న వేళలో పర్యాటక ప్రాంతాలు మరింత అందంగా కనిపించాయి. శుక్రవారం ఉదయం కురిసిన మంచుకు జనం మన్యం ప్రాంతంలో ఉన్నామా..అన్న అనుభూతి పొందారు. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడలేదు. ఉదయాన్నే కర్మాగారాలు..పరిశ్రమలకు వెళ్లే కార్మికులు..కూలి పనులకు వెళ్లే వారు పొగమంచు, చలి తీవ్రతతో కాస్త ఇబ్బందులు పడ్డారు. వాహన చోదకులు లైట్లు వేసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– డాబాగార్డెన్స్/పద్మనాభం



దట్టమైన పొగమంచులో అంజబాబ్ సీతారామచంద్రస్వామి ఆలయం



మద్దిలో పాలాలను కమ్మేసిన మంచు



కూటమి ప్రభుత్వం దివ్యాంగులను వేదనకు గురిచేస్తోంది. మానసిక రోగులకు చుక్కలు చూపిస్తోంది. పాలన చేతకాక పింఛన్ల కోత మొదలుపెట్టడంతోపాటు సర్వేల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇందులో భాగంగా మరోసారి వైద్య పరీక్షలకు ఉపక్రమించింది. ఓ వైపు సదరం సర్టిఫికెట్లు తనిఖీ చేయడంతో పాటు మరో వైపు లేవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులను ఆస్పత్రుల చుట్టూ తిరిగేలా చేస్తోంది. ఇలా ప్రభుత్వం పెడుతున్న క్షోభకు వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. – మహారాణిపేట

కూటమి పాలన.. మానసిక వేదన

- దివ్యాంగుల పింఛన్ల కోత మొదలు
- మళ్లీ పరీక్షల పేరుతో మానసిక క్షోభ
- ఆందోళన చెందుతున్న బాధిత కుటుంబాలు



ఎంతో దూరం నుంచి వచ్చాం

ఎంతో దూరం నుంచి వచ్చాం. మా కుమారుడు బొరబండ హరిదొర మానసిక దివ్యాంగుడు. ఏ పని చేయలేడు, కనీసం ఆహారం కూడా తినలేడు. మానసిక దివ్యాంగుడి కేటగిరీలో పెన్షన్ వస్తోంది. మళ్లీ ఇప్పుడు పరీక్షలు నిర్వహించాలని నోటీసు ఇస్తే..మానసిక ఆస్పత్రికి వచ్చాం. పార్వతీపురం నుంచి చాలా ఇబ్బందులు పడుతూ చేరుకున్నాం. ప్రభుత్వం ఎందుకు ఇలా ఇబ్బంది పెడుతుందో అర్థం కావడం లేదు.

– బొరబొండ కృష్ణ దొర, బాధితుడి తండ్రి

ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో పరీక్షలు

మానసిక దివ్యాంగులను మరోసారి పరీక్షించేందుకు కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ మానసిక వైద్యశాలలో వీరిని పరీక్షించేందుకు కౌంటర్లు ఏర్పాటు చేశారు. తొలి రోజు శుక్రవారం 20 మంది మానసిక దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించారు. ఒక కౌంటర్‌లో సదరం సర్టిఫికెట్లు పరిశీలించి..మరో రెండు కౌంటర్లలో వారికి వైద్య పరీక్షలు చేపట్టారు. లేవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు రూ.15వేలు పింఛను అందజేస్తున్నారు. జిల్లాలో 319 మంది దివ్యాంగులు ఉన్నారు. వీరికి మళ్లీ పరీక్షలు నిర్వహిస్తున్నారు.



వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది



ఇలాంటి పరిస్థితి వస్తుందనుకోలేదు

ఎంతోకాలం నుంచి పింఛను తీసుకుంటున్నాం. మళ్లీ ఇప్పుడు సర్టిఫికెట్ల పరిశీలన అంటున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించాలంటున్నారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. మానసిక దివ్యాంగులు తమ కుటుంబాల సాయంతో చినవాల్తేరు ప్రభుత్వ మానసిక ఆస్పత్రికి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు బాధిత కుటుంబాలు పై విధంగా ఆవేదన వ్యక్తం చేశారు. నడవలేని స్థితిలో కొందరు..మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న మరికొందరు..ఇలా ఆస్పత్రికి అతికష్టమ్మీద తీసుకువచ్చారు. మా పిల్లలకు చేతనైతే సాయం చేయాలి..అంతేకానీ ఇలా మానసిక క్షోభకు గురి చేయడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు.

మళ్లీ పరీక్షలు చేయాలట..

చిన్న తనం నుంచి బాబు బ్రెయిన్ ఎదగలేదు. వయస్సు పెరుగుతున్నా ఎదుగుదల లేదు. మానసిక వ్యాధుల్లో ఇదో రకమని వైద్యులు చెబుతున్నారు. మానసిక వైద్యుడి సలహా మేరకు మందులు వాడుతున్నాం. ఏ పని చేయలేడు. అన్నం కూడా తినిపించాల్సిందే. బాబు జశ్వంత్ వర్ధన్‌ను వైద్యులు పరీక్షించాలంటే ఇక్కడకు తీసుకొచ్చాం. ఎప్పటి నుంచో తీసుకుంటున్న పెన్షన్ కోసం మళ్లీ ఈ పరీక్షలేంటో అర్థం కావడం లేదు.

– జశ్వంత్ వర్ధన్‌తో తల్లిదండ్రులు





మళ్లీ సర్వే ఎందుకో?

ఇద్దరం ఉంటే గాని మా కుమార్తెను తీసుకొని రాలేం. మనిషిలో ఎదుగుదల లేదు. ఆకలి కూడా తెలియదు. కంటికి రెప్పలా చూసుకుంటున్నాం. దివ్యాంగురాలైన మా కుమార్తె గీతకు మళ్లీ పరీక్షలు నిర్వహించాలంటే ఇక్కడ తీసుకొచ్చాం. ప్రభుత్వం ఎందుకు మళ్లీ సర్వే చేస్తుందో అర్థం కావడం లేదు.

– ఎం.కొండబాబు, (బాధితురాలి తండ్రి)

జిల్లాలో పరిశ్రమల స్థాపనకు సంపూర్ణ సహకారం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ.. ఔత్సాహికులకు సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన జిల్లా ఇండస్ట్రియల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశంలో ఆయన పలు అంశాలపై చర్చించారు. అన్ని రకాల సాంకేతిక అంశాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలని, పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే వారికి అన్ని విధాలుగా సహకారం అందించాలని సూచించారు. సమావేశంలో భాగంగా గతంలోని అజెండా అంశాలపై తీసుకున్న చర్యల గురించి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి. ఆదిశేషు వివరించారు. గాజువాక, ఆటోనగర్ వద్ద గల రోడ్ ఓవర్ వంతెన (ఆర్.వో.బి.), పెదగంట్యాడ, అగనంపూడి, ఆటోనగర్‌లో ఫ్లాట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, పీఎం విశ్వకర్మ యోజన పథకం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన ఆయన పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో విశాఖ ఆర్డీవో పి. శ్రీలేఖ, ఐలా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ఇతర విభాగాల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

27న ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు

మహారాణిపేట: రీజినల్ టూరిజం ఇన్వెస్టర్స్ ఎంగేజ్‌మెంట్ పేరుతో ఈ నెల 27న విశాఖ వేదికగా రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ పర్యాటక పెట్టుబడిదారుల సదస్సు జరగనున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారిణి కె. జ్ఞానవేణి శుక్రవారం తెలిపారు.

స్థానిక నోవోటెల్ హోటల్‌లో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సదస్సు జరుగుతుందని, జాతీయ స్థాయిలోని దిగ్గజ కంపెనీల ప్రతినిధులు భాగస్వామ్యం కానున్నారని చెప్పారు. పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆకర్షించే నిమిత్తం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అడ్వెంచర్, క్రూయిజ్ టూరిజం, ఎకో టూరిజం, అరకు కాఫీ, 2024–29 న్యూ టూరిజం పాలసీపై చర్చ జరుగుతుందని, దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, అధికార ప్రతినిధులు చర్చిస్తారని తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి, చైర్మన్, సీఎస్, పర్యాటక శాఖ ఎండీ, ఇతర ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, కలెక్టర్, ఇతర అధికారులు భాగస్వామ్యమవుతారని తెలిపారు.

దావోస్ నుంచి చంద్రబాబు దారి ఖర్చులు కూడా తేలేదు

మాజీ మంత్రి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న అంబటి రాంబాబు

గోపాలపట్నం: హైదరాబాద్‌ను అభివృద్ధి చేశానని చెప్పుకుని డబ్బాలు కొడుతున్న చంద్రబాబు మందీ మార్బలంతో దావోస్ పర్యటనకు వెళ్లి కనీసం దారి ఖర్చులకు కూడా పెట్టుబడులు తేలేకపోయారని రాష్ట్ర మాజీ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు తెస్తానని చెప్పి అక్కడి నుంచి తెచ్చిందని 'సున్నా' అని విమర్శించారు. శుక్రవారం విశాఖ వచ్చిన అంబటి విమానాశ్రయంలో విలేఖర్లతో మాట్లాడారు. చంద్రబాబు సహా పెట్టుబడుల కోసం దావోస్ వెళ్లిన ఓ మంత్రి రెడ్ బుక్ కోసం మాట్లాడుతాడన్నారు. మరో మంత్రి లోకేష్ సీఎం కావాలని భజన చేస్తాడన్నారు. అసలు వీళ్లు దావోస్ వెళ్లిన పని ఏంటి అక్కడ చేసిందేంటని ప్రశ్నించారు. దావోస్ నుంచి రాష్ట్రానికి ఎన్ని పెట్టుబడులు తెచ్చారో ప్రజలకు తక్షణమే తెలియజేయాలని డిమాండ్ చేశారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో హైదరాబాద్ తరువాత విశాఖను ఐటీ హబ్‌గా చేయాలనుకున్నారని గుర్తు చేశారు. అమరావతిని ఎంత అభివృద్ధి చేసినా నీట మునగడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాలలను వైఎస్ జగన్ ప్రారంభిస్తే వాటిని చంద్రబాబు ప్రైవేటు సంస్థలకు అమ్మేస్తున్నారని విమర్శించారు.

అక్రమ ఆస్తుల కేసులో సస్పెండైన ఉద్యోగికి పోస్టింగ్

విశాఖ సిటీ: ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టయి, సస్పెన్షన్‌కు గురైన వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ అధికారి వి.శోభన్‌బాబుకు మళ్లీ సంస్థలో పోస్టింగ్ ఇచ్చేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆయనపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఎంఆర్‌డీఏలో ప్లానింగ్ అధికారిగా పనిచేసిన శోభన్‌బాబు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఫిర్యాదులతో ఏసీబీ అధికారులు 2022, అక్టోబర్ 17న కేసు నమోదు చేశారు. అదే నెల 22వ తేదీన అతని నివాసంలోనే కాకుండా బంధువుల ఇళ్లలో కూడా తనిఖీలు నిర్వహించారు. ఇందులో రూ.2.46 కోట్లు అక్రమార్జన ఉన్నట్లు గుర్తించారు. దీంతో 26వ తేదీన ఆయనను అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టగా.. జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో వీఎంఆర్‌డీఏ ఉన్నతాధికారులు అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీ కేసులను సమీక్షించింది. ఇందులో భాగంగా శోభన్‌బాబుపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. అయితే సంస్థలో అప్రాధాన్యపోస్టులో నియమించాలని ఉత్తర్వులో పేర్కొంది.

85 మంది పోలీసులకు రివార్డులు



రివార్డు ఆర్డర్‌ను అందజేస్తున్న సీపీ శంఖబ్రత

విశాఖ సిటీ: నగర పోలీస్ శాఖలో కేసుల ఛేదనలో ప్రతిభ కనబరిచిన 85 మంది పోలీసులు రివార్డులు అందుకున్నారు. గత నెలలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన హోంగార్డు నుంచి సీఐ స్థాయి అధికారులకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం రివార్డులు అందజేశారు.

స్ఫూర్తినింపిన 'జనగణమన'



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్



జనగణమన ఆలపిస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: భారత జాతీయ గీతం జనగణమన అధికారికంగా అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని యాక్మి సంస్థ 'జనగణమన' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 3 వేల మంది యువతను ఒకే వేదికపైకి తెచ్చి జాతీయగీతం జనగణమనను మూడు సార్లు ఆలపింపజేసింది. ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానం వేదికగా శుక్రవారం ఉదయం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన యువత ఉత్సాహంగా పాల్గొని ముక్తకంఠంతో జనగణమన ఆలపించి దేశభక్తిని చాటుకున్నారు. నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి మాట్లాడుతూ జాతీయ గీతం ఓ స్ఫూర్తన్నారు. యాక్మి అధ్యక్షుడు ప్రతాప్ , సీఎంహెచ్‌వో నరేష్, రాహుల్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆమె కీలకం

- పెరిగిన మహిళా ఓటర్లు
- తుది జాబితా విడుదల
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం
- కలెక్టర్‌కు పురస్కారం
- అధికారులకు అవార్డులు

మొత్తం ఓటర్లు **20,15,934**

మహిళలు **10,21,450** | పురుషులు **9,94,365**



మహారాణిపేట : జిల్లాలో పురుషుల కన్నా మహిళే ఓటర్లే ఎక్కువ మంది ఉన్నారు. గత ముసాయిదాతో పోల్చి చూస్తే జిల్లాలో 1,698 మంది మహిళా ఓటర్లు పెరిగారు. ఈనెల 6వ తేదీన తుది ఓటర్ల జాబితాను జిల్లా యంత్రాంగం ప్రకటించింది. జిల్లాలో ముసాయిదా ప్రతిపాదిత ఓటర్లు 20,14,236 మంది ఉండగా...కొత్తగా ఓటు హక్కు కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ప్రస్తుత జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్లు 20,15,934 మంది ఉండగా, ఇందులో పురుషులు 9,94,365 మంది, మహిళలు 10,21,450 మంది, 119 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు.

అత్యధికంగా భీమిలి నియోజకవర్గంలో 3,64,593 మంది ఓటర్లు ఉండగా..వారిలో మహిళలు 1,85,744, పురుషులు 1,78,834 మంది ఉన్నారు. అత్యల్పంగా విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,13,714 మంది ఉండగా..వీరిలో మహిళా ఓటర్లు 1,08,423, పురుషులు 1,05,279 మంది ఉన్నారు. విశాఖ తూర్పు, ఉత్తర, దక్షిణ,గాజువక, పెందుర్తి నియోజకవర్గాల్లో కూడా మహిళా ఓటర్లదే పైచేయి. 18 ఏళ్లు నిండిన, యువతీ యువకులు ఓటరుగా నమోదు కావాలని జిల్లా యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఓటర్ల సంఖ్య పెరిగింది.

అందుబాటులో వెబ్‌సైట్

ఓటర్ల నమోదుకు భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్ మరోసారి అందుబాటులోకి వచ్చింది. అర్హులైన ఓటర్లంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. ఎన్‌వీఎస్‌పీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఓటర్ల నమోదు నిమిత్తం దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా విధిగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.



నేడు ఓటర్ల దినోత్సవం

ప్రతి ఏడాది జనవరి 25న ఓటర్లు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏయూలో వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఓటర్లు జాబితా తయారీలో ప్రతిభ కనబరిచిన ఎలక్టోరల్ రిటర్నింగ్ ఆఫీసర్ (ఈఆర్‌ఒ), అసిస్టెంటు ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారులు (ఎఈఆర్‌ఒలు), బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు) అవార్డులను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హరేందిర ప్రసాద్ అందజేయనున్నారు.

ఓటు హక్కు పొందాలి



18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు తప్పని సరిగా ఓటరుగా నమోదు కావాలి. అలాగే స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. జిల్లాలో ఓటరు నమోదు కార్యక్రమం ప్రతి ఏడాది నిర్వహిస్తున్నాం. అర్హులందరూ విధిగా ఓటు హక్కు పొందాలి. ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దు. ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకోవాలి. ఎన్నికల కమిషన్ పురస్కారం రావడం చాలా ఆనందంగా ఉంది.

– ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, కలెక్టర్

కలెక్టర్‌కు ఈసీ పురస్కారం

ఓటరు నమోదులో విశేష ప్రతిభ కనబర్చిన కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు ఎన్నికల కమిషన్ (ఈసీ) పురస్కారం లభించింది. జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని శనివారం విజయవాడలో జరిగే కార్యక్రమంలో పురస్కారం అందుకోనున్నారు. కలెక్టర్‌తోపాటు అప్పటి పశ్చిమ ఎన్నికల అధికారి డి.హుస్సేన్ సాహెబ్, భీమిలి నియోజకవర్గం పరిధిలో 281 పోలింగ్ కేంద్రం బీఎల్‌వో కిరణ్మయి, పెందుర్తి నియోజకవర్గం పరిధి 252 పోలింగ్ కేంద్రం బీఎల్‌వో ఎస్.అనూరాధ తదితరులు పురస్కారాలు అందుకోనున్నారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
భీమిలి	1,78,834	1,85,744	15	3,64,593	361
తూర్పు	1,42,567	1,49,739	20	2,92,326	282
దక్షిణ	1,06,743	1,10,633	33	2,17,409	236
ఉత్తర	1,40,506	1,44,696	22	2,85,224	272
పశ్చిమ	1,05,279	1,08,423	12	2,13,714	221
గాజువాక	1,67,377	1,66,766	12	3,34,155	309
పెందుర్తి	1,53,059	1,55,449	05	3,08,513	299

'ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్' సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రి అనిత

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం–2025 డైరీ, క్యాలెండర్‌ను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉద్యోగులు కలిసికట్టుగా ఉంటే.. త్వరగా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అంబేడ్కర్ భావజాలాన్ని ఇంకా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సునీల్ కుమార్, అధ్యక్షుడు కె.వి.రమణ, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు యజ్జల విజయ్‌కుమార్, కార్యదర్శి మల్లిపూడి సత్యనారాయణ, కోశాధికారి ఆనంద్, అసోసియేట్ అధ్యక్షుడు హెచ్‌డీ ఈరన్న, డైరీ కమిటీ చైర్మన్ బి.రత్న ప్రసాద్, అదనపు ఎస్పీ స్వరూపారాణి, డీఎఫ్‌వో కృపావరం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పేరు ఉంటేనే ఆమోదం

- స్థాయీ సంఘ సభ్యుల స్పష్టీకరణ
- ఒక్క అంశం మినహా అన్నింటికీ ఓకే



దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి స్థాయీ సంఘంలో వచ్చే ఏ అంశమైనా.. ఆ వార్డు కార్పొరేటర్/ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే పేరు ఉండాలని, లేకపోతే ఆ అంశాలను తిరస్కరిస్తామని స్థాయీ సంఘ సభ్యులు సంబంధిత అధికారులకు తేల్చి చెప్పారు. ఏ వార్డులో ఎంత మేర పనులు అవుతున్నాయో కనీసం కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లకపోవడంలో అంతర్యమేంటో తెలపాలని ప్రశ్నించారు. జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. 'ఇంటి పన్ను పేరు మార్చడానికి నెలలు, సంవత్సరాలు పడుతోంది.. జీవీఎంసీ దుకాణాలు, కల్యాణమండపాలు వంటి వాటికి లీజుకు లేదా అద్దెకు ఇవ్వాలంటే ఆ ప్రాంతపు విలువను ఆర్‌ఐ నిర్ణయిస్తున్నారు. ఇందుకు, సంబంధిత అధికారులు వత్తాసు పలుకుతున్నారు. దీన్ని బట్టి చూస్తూ జీవీఎంసీ ఆస్తులు ఆర్‌ఐల చేతుల్లో ఉన్నాయా అనే అనుమానం కలుగుతోంది' అని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వార్డుల్లో కార్పొరేటర్లకు విలువ లేకుండా పోతోందన్నారు. ఇక నుంచి కార్పొరేటర్ పేరు ప్రచురిస్తూ అజెండాలో అంశాలు రూపొందించాలని జీవీఎంసీ కార్యదర్శి బి.వెంకటరమణకు సూచించారు. జీవీఎంసీ దుకాణాలను బహిరంగ వేలం ద్వారా కేటాయించాలని, ఈ అంశాన్ని స్థాయీ సంఘ సభ్యులు, కార్పొరేటర్ల దృష్టికి తీసుకురావాలన్నారు. టెండర్లు పిలిచి కాంట్రాక్టర్ ద్వారా పారిశుధ్య కార్మికులను నియమించాలని అధికారులకు సూచించారు.

111లో 110 అంశాలకు ఆమోదం

స్థాయీ సంఘ సమావేశంలో 110 అంశాలతో పాటు ఒక టేబుల్ అజెండాతో కలిసి మొత్తం 111 అంశాలు పొందుపరచగా, మినిస్టీరియల్ సిబ్బందికి సంబంధించి 44వ అంశం వాయిదా వేశారు. మిగిలిన 110 అంశాలను సభ్యులు ఆమోదం తెలిపినట్టు చైర్‌పర్సన్ హరివెంకటకుమారి తెలిపారు.

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సిఫారసు మేరకు నియోజకవర్గ పరిధి పలు వార్డుల్లో రూ.2.78కోట్ల అభివృద్ధి పనులు, 97వ వార్డు పీఎఫ్‌కాలనీ నేతాజీ పార్క్‌లో పలు క్రీడా, వ్యాయామ పరికరాలు ఏర్పాటుకు ఆమోదం తెలిపారు.
- తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సిఫారసు మేరకు ఆ నియోజకవర్గ పరిధిలో రూ.1.93 కోట్ల అభివృద్ధి పనులను ఆమోదించారు.
- గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సిఫారసు మేరకు సుమారు రూ.కోటి అభివృద్ధి పనులతో పాటు జీవీఎంసీ కమిషనర్ నియోజకవర్గ పరిధిలోని వార్డుల్లో పర్యటించి ఆదేశించిన పలు అభివృద్ధి పనులకు స్థాయీ సభ్యులు ఆమోదం తెలిపారు. జోన్-8 పరిధి 90వ వార్డులో రూ.2.33 కోట్లు, జోన్-3 పరిధి 19వ వార్డులో రూ.2.75 కోట్లు, జోన్-3 పరిధి 22వ వార్డులో సుమారుగా రూ.కోటితో అభివృద్ధి పనులను ఆమోదించారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు ఎంపీడీ ఫణిరామ్, కె శివప్రసాద్, హేమావతి, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆదినారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

సభ్యులకు రూ.25 వేల గిఫ్ట్

జీవీఎంసీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ఆమోదానికి సంబంధించి ఒక్కొక్క సభ్యుడు, అధికారికి రూ.25 వేల విలువైన గిఫ్ట్ కూపన్ ఇవ్వడానికి, మొత్తం రూ.48.75 లక్షల పరిపాలన అనుమతి మంజూరు చేయాలనే అంశాన్ని టేబుల్ అజెండాగా ప్రతిపాదించగా.. సభ్యులు ఆమోదించారు. రాష్ట్ర నగరపాలక సంస్థ చట్టం 1955లోని సెక్షన్ 84 ప్రకారం, 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అంచనాలు, సవరించి న బడ్జెట్ అంచనాలను తయారు చేసి గత నెల 23న నిర్వహించిన సమావేశంలో ఆమోదం కో సం స్థాయీ సంఘం ముందు ఉంచారు. స్థాయీ సంఘం తీర్మానం నంబర్ 2,978/2024 ద్వారా అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

కొత్తవలసలో ప్రత్యేక హాల్ట్

తాటిచెట్లపాలెం. ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు విశాఖపట్నం, పరిసర ప్రాంతాల నుంచి వెళ్లే యాత్రికులు, ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. పెందుర్తి, కొత్తవలస ప్రాంత ప్రయాణికుల కోసం కుంభమేళా ప్రత్యేక రైళ్లకు కొత్తవలసలో హాల్ట్ ఇస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం–గోరఖ్‌పూర్(08562) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 16వ తేదీ రాత్రి 10.20 గంటలకు విశాఖలో బయలుదేరి 18వ తేదీ రాత్రి 8.25 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 10.48 గంటలకు కొత్తవలస చేరకుని, అక్కడ నుంచి 10.50 గంటలకు బయలుదేరుతుంది. గోరఖ్‌పూర్–విశాఖపట్నం(08561) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 19వ తేదీ మధ్యాహ్నం 2.20 గంటలకు గోరఖ్‌పూర్‌లో బయలుదేరి 21వ తేదీ మధ్యాహ్నం 12.15 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ మధ్యాహ్నం 11.22 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 11.24 గంటలకు బయలుదేరుతుంది.
- విశాఖపట్నం – దీన్‌దయాల్ ఉపాధ్యాయ (08530) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 6, 20, 27వ తేదీల్లో(గురువారం) సాయంత్రం 5.35 గంటలకు విశాఖలో బయలుదేరి ఫిబ్రవరి 8, 22, మార్చి 1(శనివారం)న తెల్లవారు 4.30 గంటలకు దీన్ దయాల్ ఉపాధ్యాయకు చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఆయా రోజుల్లో సాయంత్రం 6.05 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 6.07గంటలకు బయలుదేరుతుంది. దీన్‌దయాల్ ఉపాధ్యాయ–విశాఖపట్నం (08529) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 8, 22, మార్చి 1(శనివారం)న రాత్రి 8.10 గంటలకు దీన్‌దయాల్ ఉపాధ్యాయలో బయలుదేరి, ఫిబ్రవరి 10, 24, మార్చి 3(సోమవారం) వ తేదీల్లో తెల్లవారుజాము 3.25 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ తెల్లవారుజాము 2.36 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 2.38 గంటలకు బయలుదేరుతుంది.

గీత కులాలకు 14 మద్యం దుకాణాల కేటాయింపు



లాటరీ తీస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో ఎక్సైజ్ శాఖ డీసీ రామచంద్రమూర్తి

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గీత కులాలకు జిల్లాలో 14 మద్యం దుకాణాలు కేటాయించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఎక్సైజ్ డీసీ రామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ ప్రసాద్, గీత కులాల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ శుక్రవారం లాటరీ తీసి.. దుకాణాల కేటాయింపు చేపట్టారు. మొత్తం 14 దుకాణాలకు గానూ జీవీఎంసీ పరిధిలో 11, భీమిలి, ఆనందపురం, పద్మనాభం పరిధిలో ఒక్కొక్క దుకాణం ఏర్పాటు చేయనున్నారు. లాటరీలో జీవీఎంసీ పరిధిలో ఒకటి గౌడ్, మరొకటి యాత సామాజిక వర్గానికి రాగా, మిగిలిన తొమ్మిది దుకాణాలు శెట్టిబలిజ సామాజిక వర్గానికి దక్కాయి. ఆనందపురంలో గౌడ కులానికి, భీమిలి, పద్మనాభం మండలాల్లో శెట్టిబలిజకు రెండు దుకాణాలు దక్కినట్లు కలెక్టర్ వెల్లడించారు.

27 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లాటరీ ప్రక్రియ ప్రాథమిక వివరాలను డైరక్టరేట్‌కు నివేదిస్తామని, దీని ప్రకారం ఈ నెల 27న గెజిట్ విడుదలవుతుందన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటలకు వరకు దరఖాస్తుల స్వీకరణ, 6న పరిశీలన, 7న ఉదయం 10 గంటలకు తుది లాటరీ ప్రక్రియ ఉంటుందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 10 శాతం దుకాణాల కేటాయింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు.

జాతీయస్థాయి టీ-20 క్రికెట్ టోర్నీకి మధురవాడ బాలుడు



ట్రోఫీతో విజేత వెంకటరమణ

మధురవాడ: జాతీయ స్థాయి అండర్–14 క్రికెట్ టీమ్‌కు మధురవాడ సమీపంలోని బోరవానిపాలేనికి చెందిన ఎనుముల వెంకటరమణ ఎంపికయ్యాడు. ఈ నెల 28 నుంచి ఆగ్రాలో జరిగే అండర్–14 టీ–20 పోటీల్లో వెంకటరమణ ఆడనున్నాడు. ఇటీవల ఒంగోలులో జరిగిన పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి ఈ పోటీలకు ఎంపికయ్యాడు. ఓ ప్రైవేట్ స్కూల్లో చదువుతున్న వెంకటరమణ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియం బీ గ్రౌండ్‌లో కోచ్‌లు వెంకటరమణ, ఆదిత్యల వద్ద శిక్షణ పొందుతున్నాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ రమణను అభినందించారు.

సమాచారం అందించడంలో జాప్యం వద్దు

బ్యాంకు అధికారులకు సీపీ సూచన



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: సైబర్ క్రైం కేసుల్లో బాధితులకు న్యాయం చేయాలంటే బ్యాంక్ అధికారులు, సిబ్బంది లావాదేవీల సమాచారాన్ని జాప్యం లేకుండా అందించాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి బ్యాంక్ అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో శుక్రవారం బ్యాంక్, ఏటీఎం సెక్యూరిటీ ఏజెన్సీల జోనల్ హెడ్‌లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సైబర్ క్రైంలో బాధితులు ఫిర్యాదు ఇచ్చిన వెంటనే దర్యాప్తు కోసం సంబంధిత బ్యాంకుకు సమాచారం అందించమంటే కొందరు నెల రోజులు గడిచినా ఇవ్వలేదన్నారు. ఇది సైబర్ క్రైం నిందితులకు బ్యాంక్ సిబ్బంది సహాయం అందిస్తున్నట్లు పరిగణించాల్సి ఉంటుందని తేల్చి చెప్పారు. బీఎన్ఎస్, బీఎన్ఎస్ఎస్, బీఎస్ఏ ప్రకారం సమాచారం అందజేయడంలో జాప్యం చేసిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామని హెచ్చరించారు. సైబర్ క్రైం పోలీసుల నుంచి పంపిన మెయిల్‌లకు సమయానికి స్పందించి బాధితులకు రిఫండ్ ప్రాసెస్ తొందరగా చేయాలన్నారు. ఏటీఎంలు చోరీలకు సంబంధించిన క్రైం సీన్ ఫొటోలు, వీడియోలను ప్రదర్శించి.. చోరీలు జరుగుతున్న తీరుపై అవగాహన కల్పించారు.

పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి

నగర పోలీస్ అధికారులు, సిబ్బంది పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని, అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడినా తక్షణమే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. పోలీస్ సమావేశ మందిరంలో శుక్రవారం ఏడీసీపీలు నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలోని రౌడీషీటర్లు, వారిపై పెడుతున్న నిఘా చర్యలను ఆరా తీశారు. సీపీ ఇచ్చిన నంబర్ వచ్చిన ఫిర్యాదులను సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. పోక్సో కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నగరంలో రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలని చెప్పారు. సైబర్ క్రైం నేరాల నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆహ్వానించి పలు న్యాయ సంబంధిత అంశాలపై పరస్పరం చర్చించారు. డీసీపీ–1 అజిత వేజెండ్ల, డీసీపీ–2 డి.మేరీప్రశాంతి, డీసీపీ(అడ్మిన్) కృష్ణకాంత్, డీసీపీ(క్రైం) కె.లతామాధురి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీ జోనల్ కమిషనర్‌పై క్రమశిక్షణ చర్యలు

మహారాణిపేట: అనకాపల్లిలో అక్రమ నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై అప్పటి జీవీఎంసీ జోనల్ కమిషనర్‌తో పాటు మరో 10 మంది సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2022లో అనకాపల్లిలో జరిగిన అక్రమ నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు వచ్చాయి. అయినప్పటికీ అధికారులు వాటిపై చర్యలు తీసుకోలేదు. దీంతో 2022 ఆగస్టు 4న అప్పటి అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో అక్రమ నిర్మాణాలు బయటపడటంతో అధికారులు నివేదిక రూపొందించారు. దీంతో వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అనకాపల్లి జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి, ఏసీపీలు డి.శ్రీనివాసరావు, పి.రోహిణి, పి.అమ్మాజీ, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ గాడి విజయకుమార్, సిద్ధబత్తుల వరప్రసాదరావు, టౌన్ ప్లానింగ్ అధికారి గ్రంధి నాగలత, టౌన్ సర్వేయర్ డి.వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్ పి.శివమూర్తి, జూనియర్ అసిస్టెంట్ నూక రాములపై క్రమశిక్షణ చర్యల కోసం సిఫారసు చేశారు.

నర్సింగ్, బీఈడీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) బీఎస్సీ నర్సింగ్, బీఈడీ–2025 ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రవేశాల్లో భాగంగా విద్యార్థులు తొలుత ప్రవేశ పరీక్ష రాయాల్సి ఉంటుంది. బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు https:// ignounursing. samarth. edu. in/ index. php లింక్ ద్వారా, బీఈడీ ప్రవేశాలకు https:// ignou& bed. samarth. edu. in/ index. php/ లింక్ ద్వారా విద్యార్థులు ఫీజు చెల్లించవచ్చు. ఫిబ్రవరి 21లోగా దరఖాస్తు చేసుకోవాలని, మార్చి 16న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని ధర్మారావు తెలిపారు.

రేపు మాంసం దుకాణాలకు సెలవు

దాబాగార్డెన్స్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లాలో మాంసవిక్రయాలకు సెలవు ప్రకటించినట్టు జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ తెలిపారు. కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ హరేందిర ప్రసాద్ ఆదేశాల మేరకు జీవీఎంసీ పరిధిలో మటన్, చికెన్, చేపల విక్రయాలు నిషేధించినందున ఎవరూ దుకాణాలు తెరవ కూడదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

బాలికల గృహంలో సద్దుమణిగిన గొడవ

మరో బాలికను తల్లికి అప్పగింత

ఆరిలోవ: ప్రభుత్వ బాలికల గృహంలో చెలరేగిన గొడవ సద్దుమణిగింది. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చొరవతో సీడబ్ల్యూసీ(బాలల సంక్షేమ కమిటీ), గృహ అధికారుల సమన్వయంతో బాలికలు చేసిన ఆందోళనకు ముగింపు పడింది. ఐదుగురు బాలికలు తమను ఇళ్లకు పంపాలని మూడు రోజులపాటు నిరసన వ్యక్తం చేశారు. వీరిలో పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు, కృష్ణా జిల్లాకు చెందిన ఒక బాలికను గురువారం వారి ఇళ్లకు పంపారు. మిగిలిన ఇద్దరు బాలికల విషయమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం, సీడబ్ల్యూసీ సభ్యులతో కలిసి శుక్రవారం బాలికల గృహాన్ని సందర్శించారు. శ్రీకాకుళం సీడబ్ల్యూసీ సభ్యులతో సంప్రదింపులు జరిపారు. ఆ ప్రాంతానికి చెందిన బాలిక తల్లిని గృహానికి పిలిపించి.. బాలికను ఆమెకు అప్పగించినట్లు చైర్మన్ తెలిపారు. అనంతపురానికి చెందిన ఐదో బాలిక కేసు హైకోర్టు పరిధిలో ఉందని, హైకోర్టు తీర్పు ప్రకారం ఆ బాలిక విషయంలో చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ వివాదం సద్దుమణగడానికి సహకరించిన కలెక్టర్ హరేందిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, పలు జిల్లాల సీడబ్ల్యూసీ సభ్యులకు కమిషన్ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.

ఈతకు దిగి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



నాని మృతదేహం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్‌లో శుక్రవారం ఈతకు దిగిన విద్యార్థి మీసాల నాని (20) మృతి చెందాడు. కొమ్మాది గాయత్రీ ఇంజినీరింగ్ కళాశాలలో అతను సివిల్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం గరివిడి మండలం కందిపేటకు చెందిన నాని, ఆరుగురు స్నేహితులతో కలిసి సరదాగా రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లాడు. ఈతకు దిగిన సమయంలో నాని రిజర్వాయర్‌లో మునిగిపోతుండటంతో, అతని స్నేహితులు కాపాడాలని కేకలు వేశారు. అక్కడే ఉన్న గ్రామస్తులు ప్రయత్నించినప్పటికీ, నాని మునిగిపోయి మృతి చెందాడు. ఆనందపురం పోలీసులు, తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది రిజర్వాయర్ వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ వాసునాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నాని కొమ్మాదిలోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. అతని తల్లిదండ్రులు వ్యవసాయదారులు. మిగిలిన వివరాలు తెలియాల్సి ఉంది.

కానిస్టేబుళ్ల పరీక్షల్లో ఇద్దరికి అస్వస్థత

ఒకరి పరిస్థితి విషమం?

ఆరిలోవ: కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో జరుగుతున్న కానిస్టేబుళ్ల నియామక పరీక్షల్లో శుక్రవారం మరో ఇద్దరు అభ్యర్థులు అస్వస్థతకు గురయ్యారు. గురువారం జరిగిన పరీక్షలో జీవీఎంసీ 10వ వార్డు పరిధి రవీంద్రనగర్‌కు చెందిన శ్రావణ్‌కుమార్ 1,600 మీట ర్ల పరుగులో పాల్గొన్న అనంతరం అస్వస్థతకు గురై.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంగతి తెలిసిందే. శుక్రవారం మరో ఇద్దరు అభ్యర్థులు అస్వస్థతకు గురికావడంతో పోలీసులు వారిని అంబులెన్స్‌లో విమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం వారిద్దరూ విమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అయితే పోలీస్ అధికారులు మాత్రం ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. వారిద్దరూ 1,600 మీటర్ల పరుగు పోటీ మధ్యలోనే అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో గత నెల 31 నుంచి కానిస్టేబుళ్ల నియామక పరీక్షలు జరుగుతుండగా, శుక్రవారం జరిగిన పరీక్షకు 600 మందికి గానూ 568 మంది హాజరయ్యారు. వీరికి పీఎంటీ, పీఈటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన 375 మందిని రాత పరీక్షకు ఎంపిక చేసినట్లు అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్‌రావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు ఈ పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు.